కథ

# నాన్న పేరు నిలబెడతా

**– దూరి వెంకటరావు**

ఉన్నట్టుండి ఉమ గుర్తొచ్చాడు.

మెడికల్ కాలేజీలో మేమిద్దరం క్లాస్‌మేట్స్. వాడి పూర్తిపేరు ఉమామహేష్. షార్ట్‌కట్‌లో 'ఉమా' అని పిలిచే వాళ్ళం. వాడిని చూసి పదేళ్ళవుతోంది. ఇప్పుడెలా ఉన్నాడో? ఫోన్ చేద్దామంటే వాడి నెంబరు తెలీదు. ఇప్పుడంటే అందరి చేతుల్లో మొబైల్స్ ఉంటున్నాయి. ఆ రోజుల్లో ఇలాంటి సదుపాయాలేవి? ఇద్దరం ఒకే రూంలో ఉండి మెడిసిన్ పూర్తి చేసాం. వాళ్ళ నాన్న గారు కూడ డాక్టరే. క్లినిక్ పెట్టి ఉన్న ఊళ్ళోనే వైద్యం చేస్తుండేవారు. మేం హౌస్‌సర్జను అవుతుండగా ఆయన పోయినట్లు గుర్తు. పట్టా పుచ్చుకోగానే ఉమ నాన్నగారి ఛార్జీ తీసుకుని ప్రాక్టీసు మొదలు పెట్టాడు. నేను మాత్రం ఓ మంచి పేరున్న ప్రవేటు హాస్పిటల్‌లో డాక్టరుగా చేరిపోయాను. ఆదాయం బాగానే వుంది. పోతే, అతగాడి ప్రాక్టీసు ఎలా ఉందో?... అక్కడికి వెళితేగాని తెలీదు. ఎలాగైనా స్నేహితుణ్ణి చూడాలన్న పట్టుదలతో రెండు బస్సులు మారి వాళ్ళ ఊళ్ళో అడుగు పెట్టాను.

ఆ ఊరు పల్లె కాదు. అలా అని పట్నం అనలేం. తగినంత జనాభాతో పాటు ఊరికి ఉండవలసిన హంగులన్నీ ఉన్నాయి.

డాక్టర్ ఉమామహేష్, యం.బి.బి.యస్ అన్న బోర్డు చూసి ఠక్కున ఆగిపోయాను. హాస్పిటల్ రోగులతో రద్దీగానే ఉంది.

కలవబోతున్నది స్నేహితుణ్ణే కదా అనుకుని ఫార్మాలిటీస్ ఏవీ అబ్జర్వు చేయకుండా గబగబా లోనికి వెళ్ళబోయాను.

''సార్, ఫీజు చెల్లించి టోకెన్ తీసుకుని వెయిట్ చెయ్యండి. మీ వంతు రాగానే లోపలకు పంపిస్తాను'' అన్నాడు డాక్టరు రూంకి అడ్డంగా నిలబడ్డ వ్యక్తి.

''నేను పేషంటును కాదు. డాక్టర్ ఉమ నా ఓల్డ్ ఫ్రెండ్. వాడిని చూడాలని ఎంతో దూరం నుంచి వచ్చాను.'' రిక్వెస్టింగ్‌గా అన్నాను.

నా మాటకు ఏమనుకున్నాడో ఏమో వెళ్ళమన్నట్లు ప్రక్కకు జరిగాడు.

ఉమ నన్ను చూస్తూనే ''హాయ్ హరీ!'' అంటూ లేచొచ్చి నన్ను కౌగిలించుకున్నంత పని చేసాడు. వాడు మారలేదు. అప్పుడెలా ఉండేవాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు.

''బావున్నావా?... ఎన్నాళ్ళైందిరా నిన్ను చూసి... ప్రాక్టీస్ ఎలా ఉంది?'' అడిగాను సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతూ.

''చూస్తున్నావు కదా!... రా ఇలా కూర్చో,'' అని చెప్పి పావుగంట వరకు పేషెంట్లెవ్వరినీ లోనికి పంపించవద్దని కంపౌండర్ని ఆదేశించాడు.

ఇరువురం మాటల్లో పడ్డాం.

''ఏం తీసుకుంటావ్ కాఫీయా కూల్ డ్రింకా?''

ఇప్పుడేమీ వద్దన్నాను.

అంతలో ఎవరో తోసుకుంటూ లోపలకు రాబోతే, ''ఫీజు చెల్లించకుండా డాక్టరు గారిని చూడటానికి వీల్లేదు,'' అంటూ అతడి జబ్బ పట్టుకుని బలంగా బయటకు నెట్టుతున్నాడు కంపౌండరు.

''నా కాడ డబ్బుల్లేవయ్యా. డాట్టరుబాబుతో నా సొదేదో సెప్పుకుంటాను. నన్ను ఒగ్గేయ్ బాబు నీకు పున్యముంటాది,'' అంటూ అతడితో పెనుగులాడు తున్నాడు ఆ ఆసామి.

''కళ్యాణ్! వాడిని విడిచిపెట్టు'' అన్నాడు ఉమ.

''దండాలు డాట్టరు బాబూ దండాలు. మీ అయ్య సచ్చి ఏ లోకాన ఉన్నాడో దర్మపెబువు, కాసుల్లేకున్నా మా బోటోళ్ళని కనికరించి మందులిచ్చేవోడు. అట్టాగే తమరూ నా మీద దయ చూపండయ్యా. పొద్దు నుంచి ఇరోచనాలవు తున్నాయి. మొహం జుమ్మంటోంది. మందిచ్చి పున్యం గట్టుకోండి'' చేతులు జోడిస్తూ వేడు కున్నాడు వచ్చిన వ్యక్తి.

''రా ఇలా కూర్చో,'' మొక్కుబడిగా నాడి పరీక్షించి మందులు రాసిచ్చి పంపేసాడు ఉమ.

''ఔనూ, మీ తండ్రిగారు డబ్బుల్తో నిమిత్తం లేకుండా ఎంతో ఉదారంగా వైద్యం చేసేవారనే వాడివి. మరి నువ్వేంటి డబ్బులు ముందుగా చెల్లిస్తే తప్ప ఎవ్వరినీ లోనికి రానివ్వడం లేదు'' అడిగాను ఉండబట్టలేక.

''నువ్వన్నది నిజమే. నాన్నగారు డబ్బులిచ్చుకోలేని వాళ్ళకి ఉచితంగానే వైద్యం చేసేవారు అందుకే ఈ ఊళ్ళో అంతా ఆయన్ని ఇప్పటికీ దేవుడని కీర్తిస్తుంటారు. ఇప్పుడు వాడేమన్నాడో విన్నావు కదా! కొడుకుగా ఆయనకున్న మంచిపేరు నిలబెట్టాలంటే నేనీ మాత్రం కఠినంగా వ్యవహరించక తప్పదు. నన్ను తిట్టుకున్నా, మా నాన్నని మాత్రం గుండెల్లో పెట్టుకుంటారు'' అన్నాడు ఉమ.

కాలేజీలో చదివేటప్పుడు డాక్టర్నై నాన్న పేరు నిలబెడతానంటే ఏమిటో అనుకున్నాను. తండ్రి పేరు ఇలా నిలబెడుతున్నాడన్న మాట. వాడు చేస్తున్న పనికి మెచ్చుకోవాలో, నొచ్చుకోవాలో తెలీడం లేదు. ❑

